ఫుట్‌పాట్లు.. ట్రాఫిక్ ఇక్కట్లు

గాజువాకలో వ్యాపారాల నిర్వహణకు, వాహనాల పార్కింగ్‌కూ రోడ్లే ఆధారమవుతున్నాయి. దీంతో రాకపోకలు నరకాన్ని తలపిస్తున్నాయి. రోడ్ల విస్తరణ ప్రతిపాదనలు ఎన్ని చేసినా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, రోడ్లపై పార్కింగ్‌లను నిరోధించకపోవడంతో జనానికి అవస్థలు తప్పడం లేదు. మహానగరంలో అతిపెద్ద జోన్ అయిన గాజువాకలో ఈ పరిస్థితిని చూస్తూ ఊరుకోవడమే తప్ప అధికార యంత్రాంగం స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఫుట్‌పాత్‌లు, సెల్లార్లలో వ్యాపారాలకు చెక్ పెట్టాలని విన్నవిస్తున్నారు.


గాజువాక మెయిన్ రోడ్‌లో ఇదీ పరిస్థితి

- వ్యాపారుల ఆక్రమణలో ఫుట్‌పాత్‌లు
- అమలుకాని సెల్లార్ పార్కింగ్‌లు
- రోడ్లపై వాహనాల నిలుపుదల
- గాజువాకలో నిత్యం గజిబిజి


కణితి రోడ్‌లో రోడ్ మార్జిన్ లో దుకాణాలు

గాజువాక: గాజువాక మెయిన్‌రోడ్‌లోని ఫుట్‌పాత్‌లు వ్యాపారులకు ఉపయోగపడుతున్నాయి.ఫలితంగా జనానికి ఫుట్ పాట్లు తప్పడం లేదు. ఫుట్‌పాత్‌లను రెడీమేడ్ వ్యాపారులు, చెప్పుల దుకాణాలు, పండ్ల వ్యాపారులు ఆక్రమించేశారు. గతంలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించేవారిని ప్రత్యేక జోన్‌కు తరలించాలని ప్రతిపాదించారు. రాజకీయ అడ్డంకులు రావడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. పెద్ద పెద్ద షోరూమ్‌లు కూడా ఫుట్‌పాత్‌లను తమ వ్యాపారాల కోసం ఉపయోగించుకొంటున్నాయి. సరైన పార్కింగ్ ఏర్పాటు చేయకపోవడంతో కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. ప్రధాన వీధుల్లోనూ పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఫలితంగా గాజువాక ట్రాఫిక్ పద్మవ్యూహంగా మారుతోంది.

విస్తరించినా తప్పని బెడద

కోట్లాది రూపాయలు ఖర్చు చేసి కణితి రోడ్‌ను విస్తరించినా అక్కరకు రాని పరిస్థితి నెలకొంది. గతంలో 40 అడుగులున్న ఈ రోడ్‌ను జీవీఎంసీ 60 అడుగులకు విస్తరించింది. గాజువాక మార్కెట్ నుంచి జగ్గు జంక్షన్ వరకు విస్తరించేందుకు ఇప్పటివరకు సుమారు రూ.7 కోట్ల వరకు ఖర్చు చేశారు. జీవీఎంసీ అధికారులు రకరకాల అడ్డంకులను దాటుకొని మొదటి దశ విస్తరణను దాదాపు పూర్తి చేశారు. అయితే, ప్రస్తుతం అది కూడా అనధికార పార్కింగులకు ఉపయోగపడుతోంది. కోట్లు ఖర్చు చేసినా ఆ రోడ్‌లో ట్రాఫిక్ మాత్రం నరకప్రాయంగానే ఉంది.

వాణిజ్య కేంద్రాలుగా సెల్లార్లు

పార్కింగ్‌కు ఉపయోగించాల్సిన సెల్లార్లను సైతం వ్యాపారాలకు వినియోగిస్తున్నారు. సెల్లార్ పార్కింగ్‌లను అమల్లోకి తేవాలని 2009లో జీవీఎంసీ అధికారులు చేసిన ప్రయత్నాలు పట్టాలెక్కలేదు. గాజువాక ప్రధాన మార్గంలో 24 సెల్లారు ఆక్రమణలను గుర్తించారు. బృందాలను నియమించి పాతగాజువాక, సినిమా హాలు కూడలి, కొత్తగాజువాకలో ఆక్రమణలను తొలగించారు. రాజకీయ ఒత్తిళ్లు వచ్చినప్పటికీ అధికారులు దూకుడు ప్రదర్శించి పోలీసుల సాయంతో 10 సెల్లార్లను ఖాళీ చేయించారు. దీంతో ప్రధాన రహదారిలో కొంతమేరకైనా ట్రాఫిక్ ఇక్కట్లు తగ్గుతాయని అంతా భావించినప్పటికీ సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. అధికారులు వివిధ కార్యక్రమాల్లో నిమగ్నమై సెల్లార్లను పట్టించుకోవడం మానేశారు. రాజకీయ నాయకులు రంగ ప్రవేశం చేయడంతో మిగిలిన సెల్లార్లను పక్కన పెట్టేశారు. దీంతో పరిస్థితి మళ్లీ యథాతథంగా మారింది.

పార్కింగ్‌కు చోటేది?

నిత్యం రద్దీగా మారుతున్న గాజువాకలో వాహనాల పార్కింగ్ సమస్యగా తయారైంది. భారీ వాహనాలను సైతం జనావాసాల మధ్య, ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. ట్రక్ టెర్మినల్ లేకపోవడం వల్ల ట్యాంకర్లు, లారీలు, ట్రాలర్ల పార్కింగ్ సమస్యాత్మకంగా మారింది. పోలీసుల అనుమతితో శ్రీనగర్‌వద్ద, షీలానగర్ జాతీయరహదారిపైనా వాహనాలు నిలుపుతున్నారు. అనధికారికంగా చినగంట్యాడలోని కణితి రోడ్‌లో, ఇక్కడి వందడుగుల రోడ్‌లో నిలిపివేస్తున్నారు. రోడ్లపైనే వాహనాలను నిలిపివేస్తుండటంతో నిత్యం ప్రజలకు అసౌకర్యం ఏర్పడుతోంది. అస్తవ్యస్త పార్కింగువల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి. సరైన స్థలం లేదనే కారణంతో ట్రక్ టెర్మినల్ వ్యవహారం వెనక్కి పోయిన విషయం తెలిసిందే.


నివాస ప్రాంతాల్లో లారీల పార్కింగ్

అంతా అస్తవ్యస్తం



గాజువాక రోడ్లపై ఇష్టానుసారంగా వ్యాపారాలు చేస్తున్నారు. ప్రధాన రహదారుల్లో భారీ వాహనాలు తిరుగుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ ఆపేస్తున్నారు. రోడ్ మార్జిన్లు, ఫుట్‌పాత్‌లపై నడవడానికి కూడా అవకాశం ఉండడం లేదు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జాగరపు శ్రీను, గాజువాక

పరిస్థితి దారుణం



గాజువాకలో ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమణకు గురయ్యాయి. రోడ్‌మార్జిన్లను కూడా వ్యాపారులు ఆక్రమించుకొంటున్నారు. దీనివల్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఒక కిలోమీటరు దూరం ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకొని పరిస్థితిని చక్కదిద్దాలి.

– కె.ఎల్.రాజు, గాజువాక

సమస్య పరిష్కారానికి చర్యలు

గాజువాకలో ఈ పరిస్థితి ఇబ్బందిగానే ఉంది. వీలైనంత తొందరగా ఫుట్‌పాత్‌లపై దృష్టి సారిస్తాం. గాజువాక మార్కెట్‌కు వచ్చే లారీల రాకపోకలకు సమయాలను నిర్దేశిస్తాం. ట్రాఫిక్ పోలీసులతో కలిసి దీనిపై కసరత్తు కొనసాగిస్తాం. కలిసొచ్చే స్థానిక సంఘాలను కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములను చేస్తాం

– బి.ఆర్.ఎస్.శేషాద్రి, గాజువాక జోనల్ కమిషనర్

ఉక్కు ఆస్పత్రిలో సదుపాయాల కల్పనకు చర్యలు


ఉక్కు జనరల్ ఆస్పత్రి నూతన విభాగాధిపతి డాక్టర్ సారంగినిని సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రిలో సదుపాయాల మెరుగుపర్చడానికి చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్ కోరారు. ఆస్పత్రి నూతన విభాగాధిపతిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సారంగినిని మంగళవారం ఐఎన్‌టీయూసీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వైద్యులతో పాటు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, కొమ్ము ప్రసాదరావు, డి. మోహన్, గోపాలకృష్ణ, బి.టి. జగదీష్, రమణమూర్తి, ఎస్.ఎ. నాయుడు పాల్గొన్నారు.

ప్రతి విషయాన్ని ఆనందంగా స్వీకరించాలి


ప్రసంగిస్తున్న పిరమిడ్ మాస్టర్ వంశీకిరణ్

గాజువాక: జీవితంలో ప్రతి విషయాన్ని ఆనందంగా స్వీకరించాలని పిరమిడ్ మాస్టర్ వంశీకిరణ్ అన్నారు. స్థానిక శ్రీనివాసనగర్‌లోని ప్రకృతి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెడు అలవాట్లకు చోటివ్వకుండా ఉండడంతో పాటు ధ్యానం చేయడం వల్ల ప్రతి అంశంలో మనదే పైచేయి అవుతుందని అన్నారు. శ్వాసపై ధ్యాస ఉంచి ధ్యానం చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆనందంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ ధ్యాన కేంద్రం మాస్టర్ శివ గణేశ్వరరావు, విశ్వశక్తి ప్రకృతి పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు సత్యారావు, ఉషారాణి, పిరమిడ్ మాస్టర్లు సుబ్బలక్ష్మి, నూకరత్నం, బుజ్జి, జయలక్ష్మి, పద్మ, మంజు, మాధవి, సత్యవతి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

షిర్డీసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు, పారాయణ దారులు

అగనంపూడి: మార్గశిర మాసం ఆరంభం.. కార్తీక మాసం ముగింపు సందర్భంగా అగనంపూడి షిర్డీసాయి బాబా ఆలయంలో మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. షిర్డీసాయి మహిళా కమిటీ, పారాయణ కమిటీ ప్రతినిధులు విష్ణు సహస్ర పారాయణం, లలితా స్తోత్రాలు, సాయి చాలీసా, లింగాష్టకం తోపాటు మరికొన్ని స్తోత్రాలు పారాయణం చేశారు. అలాగే కార్తీకమాసంలో నెలరోజుల పాటు పారాయణం చేసిన మహిళా బృందాన్ని సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు రమణారెడ్డి, వ్యాసశర్మ, కొయ్య అరుణ, ధర్మాల సత్యలక్ష్మి, గుదే లీలావతి, పి.పంకజ, జి.శంభుడు, రాధాకృష్ణ, జి.రవిచంద్రారెడ్డి, పి.రామారావు, పీఎల్ఎస్‌రాజు, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక: వందేభారత్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న దివ్యాంగుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల పోస్టర్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మంగళవారం ఆవిష్కరించారు. పోటీల నిర్వాహకుడు ఉరుకూటి చైతన్య మాట్లాడుతూ ఈ పోటీల్లో పది జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. పోటీలను జింక్ గ్రౌండ్‌లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.నరేంద్రరావు, ఆర్.పి.నాయుడు, నర్సింహా, గుర్నాథ్‌రెడ్డి, సునీల్ శర్మ పాల్గొన్నారు.

పుట్టబంగారం స్థలంపై విచారణ


పుట్టబంగారం స్థలం వద్ద విచారణ చేస్తున్న ఆర్ఐ మృదుల, సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ వెనుక పుట్టబంగారం స్థలం ఆనవాళ్లు ఓ కుటుంబం తొలగించిందని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు విచారణ చేశారు. గాజువాక ఆర్ఐ మృదుల సిబ్బందితో సర్వే నంబర్ 26లో పుట్టబంగారం స్థలం వద్దకు చేరుకున్నారు. గ్రామ పెద్దలతో కలిసి పుట్టబంగారం ఆనవాళ్లను తొలగించి ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. కాగా ఈ స్థలం తమదని, దీనికి సంబంధించి అన్ని రకాల పత్రాలు తమ వద్ద ఉన్నాయని ఆర్ఐకు వివరించారు. దీంతో ఆర్ఐ స్థలానికి సంబంధించిన పత్రాలను రెండు రోజుల్లో తమకు అందించాలని సూచించారు. లేని పక్షంలో ఆ స్థలంలో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రేడ్ 1 వీఆర్వో ఆనంద్ పాల్గొన్నారు.

రైల్వే సిబ్బందికి సత్కారం

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించిన సిబ్బందిని డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్‌కుమార్ సాహూ సత్కరించారు. క్యారేజ్ అండ్ వేగన్ విభాగానికి చెందిన జి. రవికుమార్ (అసిస్టెంట్), సంతోష్‌కుమార్‌లు లోకోమోటివ్‌కు చెందిన సెంటర్ బఫర్ కప్లర్‌లో సమస్య తలెత్తడం గుర్తించి వెంటనే నివారించడంలో సహకరించారు.

భూలోకరెడ్డికి ఘన నివాళి


భూలోకరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా , మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నిర్వాసితుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా పులి భూలోకరెడ్డి చేసిన సేవలు మరువలేమనిఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య అన్నారు. నిర్వాసితుల సంఘం నాయకుడు పులి భూలోకరెడ్డి 17వ వర్ధంతిని కుమారుడు పులి రమణారెడ్డి ఆధ్వర్యంలో పెదగంట్యాడ కూడలిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భూలోకరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పులి లక్ష్మీబాయి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, నిర్వాసితుల సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి, 75వ వార్డు కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, కాకి గోవింద రెడ్డి, ఉరుకూటి చందు, పల్లా శ్రీనివాసరావు, తిప్పల వంశీరెడ్డి, రౌతు శ్రీనివాసరావు, నరసింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు


దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఏసీపీ త్రినాథ్

అగనంపూడి: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, నిఘా రెట్టింపు చేసి గంజాయి రవాణా చేస్తున్న ముఠాలను అరికడుతున్నామని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ అన్నారు. దువ్వాడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరుసగా నాలుగు ముఠాలను అరెస్టు చేశామన్నారు. ముందస్తు సమాచారం మేరకు దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలోని మంగళపాలెం వద్ద నిఘాపెట్టి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 40 కేజీల గంజాయితో పాటు పల్సర్ బైక్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీఐ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ప్రతిపాదిత స్థలం పరిశీలన


సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు

అగనంపూడి: అగనంపూడి, వెదుళ్లనరవ, దువ్వాడ ప్రాంతాల విద్యుత్ వెతలు తీర్చేందుకు జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదిత స్థలాన్ని మంగళవారం ఈపీడీసీఎల్ అధికారులు పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో తరచూ విద్యుత సమస్య తలెత్తుతోంది. దీంతో అగనంపూడి పునరావాస కాలనీల అవసరాల కోసం సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు.

ఈ క్రమంలో అనకాపల్లి జిల్లా ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్, డీఈ రాజేష్ తమ సిబ్బందితో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయం అవసరాల కోసం రెండు సబ్‌స్టేషన్లు, అగనంపూడి పునరావాసకాలనీల సౌకర్యం కోసం 220కెవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు చేశామని చెప్పారు. వీటి కోసం సుమారు పది ఎకరాల స్థలం అవసరముంటుందని తెలిపారు. ఈమేరకు మంగళపాలెం, ఈ. మర్రిపాలెం సమీపంలో స్థలాన్ని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఈఈ ఎస్.రామకృష్ణ, డీఈఈ బి.కనకారావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, బండారు చందు రమేష్, ఏఈ జయ లక్ష్మణరావు పాల్గొన్నారు.

పెన్షన్ చెల్లించకుండా వేధించడం అన్యాయం

స్టీల్ సీఐటీయూ నాయకుడు వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు వెంకటేశ్వరరావు

అగనంపూడి: ఉద్యోగ విరమణ పొందిన ఉక్కు కార్మికులకు పెన్షన్ చెల్లించకుండా కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులను ఉక్కు యాజమాన్య వేధిస్తుందని స్టీల్‌ప్లాంట్ సీటూ నాయకుడు డీసీహెచ్ వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో మంగళవారం చేపట్టిన 1391వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ విరమణ అనంతరం 1800 మంది కార్మికులు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. వీరి ఓపిక, సహనాన్ని పరీక్షించొద్దన్నారు. సిటూ నాయకుడు గంగాధర్ మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించకుండా దుర్మార్గంగా యాజమాన్యం వ్యవహరిస్తుందని ఆరోపించారు. యాజమాన్యం తన వైఖరి మార్చుకోకుంటే ఉత్పత్తికి విఘాతం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.భానుమూర్తి, సన్యాసిరావు, శ్రీనివాస్‌రెడ్డి, జగ్గారావు, అప్పారావు, ఎరయ్య, కోటేశ్వరరావు, సోమినాయుడు, మహేష్, రమణమూర్తి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పీఎఫ్, ఎస్‌బీఎఫ్ ట్రస్టులకు నగదు జమ చేయాలి


పే సెక్షన్ డీజీఎం రామ్‌ప్రసాద్‌తో చర్చిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల నుంచి రికవరీ చేసిన పీఎఫ్, ఎస్‌బీఎఫ్ సొమ్మును ఆయా ట్రస్టులకు వెంటనే చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ నేతృత్వంలో కోర్ కమిటీ సభ్యులు సమస్యలపై ప్లాంట్‌లోని పే సెక్షన్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ చేసిన సొమ్మును యాజమాన్యం వద్ద ఉంచుకోవడం ఏంటని ప్రశ్నించారు. పీఎఫ్, ఎస్‌బీఎఫ్ ట్రస్టులకు యాజమాన్యం కోట్లాది రూపాయలు బకాయి పడిందన్నారు. అదే విధంగా ఉద్యోగుల నుంచి రికవరీ చేసిన త్రిఫ్ట్ సొసైటీ నగదును వెంటనే జమ చేయాలన్నారు. అనంతరం పే సెక్షన్ డీజీఎం ఎస్. రామ్‌ప్రసాద్‌తో సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, కొమ్ము ప్రసాద్, పి.వి. నగేష్, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవయవ దాతల సంఘం అధ్యక్షుడిగా అప్పలనాయుడు

మహారాణిపేట: అవయవ దాతల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా మెరుగు అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని మంగళవారం అఖిల భారత సంఘం వ్యవస్థాపకురాలు గూడురు సీతామహాలక్ష్మి అప్పలనాయుడుకు అందజేశారు. అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామానికి చెందిన ఎం. అప్పలనాయుడు ఉన్నత విద్యావంతుడే కాకుండా సమాజ సేవా తత్పరుడిగా పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఎంపీటీసీ మెంబర్‌గా వ్యవహరిస్తున్నారు. గత జూలైలో ఆయన అన్న కూతురు అడవివరంలో ప్రమాదానికి గురై బ్రెయిన్ డెడ్ అయింది. అవయవ దాన ఉద్యమం పట్ల అవగాహన కలిగిన అప్పలనాయుడు కుటుంబ సభ్యులను, గ్రామ ప్రజలను ఒప్పించి ఆమె అవయవాలను దానం చేయించారు. ఆయనను సీతామహాలక్ష్మి అభినందించారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

- అవకాశాలు అందిస్తే అవరోధాలు అధిగమిస్తారు
- ఏయూ వీసీ శశిభూషణరావు


వీసీ శశిభూషణరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. మంగళవారం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో ది సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు 'టు వర్డ్స్ ఇంక్లూషన్- ఎంపవరింగ్ పర్సన్స్ విత్ డిజేబులిటీస్ ఫర్ ఏ డెవలప్డ్ ఇండియా బై 2047' ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దివ్యాంగులకు అనుకూలంగా ఉండే విధంగా కార్యాలయాల నిర్మాణాలు జరగాలని సూచించారు. ఈ దిశగా ఆంధ్ర విశ్వవిద్యాలయం కృషి చేస్తోందని చెప్పారు. అవకాశాలను అందిస్తే దివ్యాంగులు అవరోధాలను అధిగమిస్తారని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు మాట్లాడుతూ వికసితభారత్ సాకారం కావాలంటే దేశంలోని దివ్యాంగులు సైతం సాధారణ వ్యక్తులతో సమానంగా ప్రగతి సాధించే దిశగా ప్రోత్సహిస్తూ అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని ఈ సదస్సును వర్తమాన అంశంపై నిర్వహించడం జరిగిందని తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (న్యూఢిల్లీ) జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ఆర్.మనోజ్ కుమార్ కీలక ఉపన్యాసం ఇచ్చారు. విశాఖ జోన్ 1 ప్రాంతీయ ఉపాధి అధికారి టి.అనిల్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు లభించే అవకాశాలను వివరించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఏ. రాణి తాను గ్రూప్–1అధికారిగా కావడానికి చేసిన ప్రయత్నాన్ని, ప్రయాణాన్ని వివరించారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సమాజ స్థితిగతులపై అవగాహన అవసరం

మురళీనగర్: విద్యార్థులు సామాజిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఇంజినీరింగ్ విద్య, నైపుణ్య సలహాదారుడు డాక్టర్ నాగిరెడ్డి కొవ్వూరు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సివిల్ ఇంజినీరింగు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలు మెరుగుపరుచుకునేందుకు మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు పర్యవేక్షణలో సివిల్ ఇంజినీరింగు హెడ్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నీ గురించి నీవు తెలుసుకో అనే అంశంపై ఆయన ప్రసంగించారు. విద్యార్థులే భవిష్యత్తు నిర్దేశకులని, సమాజంలో జరుగుతున్న మార్పులతో పాటు సామాజిక బాధ్యతను తెలుసుకోవాల్సి ఉంటుందన్నారు. సబ్జెక్టుపై పట్టు సాధించడంతో పాటు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. విద్యార్థులు తమ గురించి తాము తెలుసుకోవాలన్నారు. తమలో ఉన్న బలాన్ని తెలుసుకుని ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. తల్లిదండ్రుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలన్నారు.

ఐడియాథాన్ నిర్వాహకులకు అభినందన


ప్రతిభ చూపిన విద్యార్థులతో రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల ఐడియా తాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎకో ఇనోవేటిక్స్ పేరుతో విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీలో ఏయూలో వివిధ భాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణహితంగా నిలిచే వివిధ సాంకేతికతలు, పరికరాలను అభివృద్ధి చేసేదిగా పనిచేశారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు, రెండో స్థానంలో వారికి రూ. 2,500లు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.1000 పురస్కారాన్ని, ప్రశంసా పత్రాన్ని అందించారు. నూతన ఆలోచనలను ప్రోత్సహించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఇందిర, కుసుమ అపర్ణ, ముదాసిర్, సబిహ తదితరులు పాల్గొన్నారు .